సాక్షి పల్నాడు

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



కార్తికేయుడి సేవలో పీఆర్కే

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం దర్శించుకున్నారు.



8,004 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 8,004, హై లెవల్ కాలువకు 330, బ్యాంక్ కెనాల్‌కు 1,807 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతలలో 45 టీఎంసీలు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో గురువారం నీటి నిల్వ 45 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 29,850 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

ఇది ప్రజలను ముంచిన ప్రభుత్వం



సత్తెనపల్లి: 'ఇది మంచి ప్రభుత్వం కాదు ... ప్రజలను ముంచిన ప్రభుత్వం' అని రాష్ట్ర మాజీ మంత్రి అంబటి రాంబాబు గురువారం ట్వీట్ చేశారు. ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లేలా కార్యాచరణ రూపొందించి 100 రోజుల పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో టీడీపీ ప్రజల్లోకి వెళ్లనుంది. దీనిపై మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎక్స్‌లో స్పందించారు. ''మాది మంచి ప్రభుత్వం అని వారం రోజులు సంబరాలు చేస్తాం అంటున్నారు.. ఎలా మీది మంచి ప్రభుత్వం? నీకు రూ.15 వేలు, నీకు రూ. 15 వేలు అని చెప్పి ఇవ్వకుండా మోసం చేసినందుకా మీది మంచి ప్రభుత్వం?'' అని ప్రశ్నించారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పోయింది, మేం హాయిగా ఉన్నాం అని అనుకోవట్లేదు ... వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎందుకు దించేశామా అని పశ్చాత్తాప పడేలా కూటమి వంద రోజుల పాలన ఉందన్నారు. నాణ్యమైన మద్యం ఇస్తాం.. తాగండి అంటూ నారా వారి సారా పాలన అనేలా రాష్ట్రంలో పరిస్థితి ఉందని విమర్శించారు.

చుక్కల భూముల పునఃపరిశీలన



పెదకూరపాడు: నియోజకవర్గంలో ఫ్రీ హోల్డ్ చేసిన చుక్కల, అసైన్డ్ భూముల వివరాలను స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఆర్.కుమోదినీ సింగ్ గురువారం రీ వెరిఫికేషన్ నిర్వహించారు. వెంట డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, పెదకూరపాడు తహసీల్దార్ దానియేలు, శ్రీనివాసరావులు ఉన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 589.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 2,236, ఎడమ కాలువకు 4,613, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,866, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 38,115 క్యూసెక్కులు వచ్చి చేరటంతో అంతే నీటిని విడుదల చేస్తున్నారు.

24 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించనున్న జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈనెల 24న ముగియనుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని ఆమె పేర్కొన్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి 9,10,11,12వ తరగతుల్లో ఏడాదికి రూ.12వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుని విద్యార్థులతో దరఖాస్తు చేయించాలని ఆమె సూచించారు.


ఆశా కార్యకర్తలతో డీఎంహెచ్ఓ సమావేశం



గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. కమిషనర్ ఆఫ్ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల ప్రకారం ప్రతి 3 నెలలకు ఒకసారి ఆశా కార్యకర్తలతో డీఎంహెచ్ఓలు సమావేశం నిర్వహించాలి. ఆ మేరకు ఏర్పాటైన సమావేశంలో వారి సమస్యలపై 12 అర్జీలను స్వీకరించారు. తన పరిధిలోని వాటిని పరిష్కరిస్తానని, మిగతావి ఉన్నతాధికారులకు పంపుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, చంద్రశేఖర్, సురేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

0 ప్రగతి 100 శూన్యం

వంద రోజుల పాలనలో చేతులెత్తేసిన పాలకులు



ఎన్నికల వేళ ఏదో చేసేస్తామని హామీలు ఇచ్చిన కూటమి నాయకులు తీరా అధికారంలోకి వచ్చాక అమలు విషయంలో చేతులెత్తేశారు. వంద రోజుల పాలనలో మచ్చుకైనా ఒక్క పని కూడా పూర్తి చేయలేని దుస్థితిపై ప్రజలు మండిపడుతున్నారు. పాలకుల మాటల్లోనే అభివృద్ధి తప్ప చేతల్లో లేదని పేర్కొంటున్నారు. నిత్యం ఎన్నో సమస్యలు తమను వేధిస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- హామీల అమల్లో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం
- ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన నాయకులు
- నేడు స్థానిక సమస్యలనూ పట్టించుకునే వారే కరువు





వరికెపూడిశెల ప్రాంతం (ఇన్‌సెట్) శిరిగిరిపాడు వద్ద చంద్రబాబు శంకుస్థాపన చేసిన శిలాఫలకం (ఫైల్)

నరసరావుపేట: ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా జిల్లాలోని ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇప్పటి ప్రభుత్వ పెద్దలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎక్కడా మచ్చుకు కూడా అమలు కాలేదు. ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని సత్తెనపల్లి, పెదకూరపాడు, చిలకలూరిపేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై కనీసం సమీక్ష కూడా చేయలేదు. సూపర్ సిక్స్ పథకాల ఊసే లేకపోగా, ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది.

ఇదిగో హామీల జాబితా...

- కూటమి పాలనలో జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఆటోనగర్ సమస్య వంద రోజుల్లో కనీసం ప్రస్తావనకు కూడా రాలేదు. సమస్య పరిష్కారానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేసానుపల్లిరోడ్డులో 17 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించి, ఆటోనగర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే మరో 15 ఎకరాల ప్రైవేటు భూమిని స్వాధీనం చేసుకొని కార్మికులకు ప్లాట్లు కేటాయిస్తామని అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాని గురించి ప్రస్తావించే నాథుడే కరువయ్యాడు. కోర్టులో ఉన్న టిడ్కో గృహాల సమస్య పరిష్కారం గురించి పాలకులు పట్టించుకోలేదు. మైనార్టీ ప్రజలకు బరంపేటలో చేపట్టిన రెండో షాదీఖానా నిర్మాణం ఊసే ఎత్తడం లేదు.
- మాచర్ల నియోజకవర్గంలో 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అటువైపు చూసిన పాపాన పోలేదు. శంకుస్థాపన చేసిన వరికెపూడిశెల ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని, బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి పట్టణ వాసులకు ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. వెనుకబడిన కారెంపూడి వంటి ప్రదేశాలకు లిఫ్ట్ ద్వారా సాగునీరు అందజేస్తామని చెప్పారు. వీటితోపాటు నాగార్జున సాగర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్న వాగ్దానమూ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.
- గురజాల నియోజకవర్గంలో ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందజేస్తామన్నారు. విద్య, వైద్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఆ దిశగా పనులు ఏమీ జరగకపోగా.. పిడుగురాళ్లలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులను కూడా నిలిపివేశారు.
- చిలకలూరిపేట నియోజకవర్గంలో గత పాలకులు ఆటోనగర్ సమస్యను కొలిక్కి తీసుకొచ్చారు. దానిని పూర్తి చేసి సమస్య తీరుస్తామన్న ప్రస్తుత పాలకులు ఇప్పటివరకు పట్టించుకోలేదు. పట్టణ వాసుల తాగునీటి సమస్యల తీర్చేందుకు అమృత్ పథకం ద్వారా నకరికల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి నేరుగా చిలకలూరిపేట వరకు పైపులైను వేస్తామని హామీ ఇచ్చారు. ఆ వాగ్దానం ఇప్పటివరకు పాలకులకు కనీసం గుర్తుకు కూడా రాలేదు.
- సత్తెనపల్లి నియోజకవర్గంలో బండ్లమోటు నుంచి పేరేచర్ల వరకు ఉన్న రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించి నేషనల్ హైవేకు కలుపుతామన్నారు. సత్తెనపల్లి - మాదిపాడు రోడ్డులోని రైల్వేగేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల ప్రజల అవస్థలను తొలగిస్తామని వాగ్దానం చేశారు. అది ఎటు పోయిందో కూటమి నేతలే చెప్పాలి. సత్తెనపల్లి నుంచి గుంటూరుకు వెళ్లే మార్గంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు, గోదావరి-పెన్నా నదుల అనుసంధానం, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేమార్గం, మేజర్ స్టేడియం, పీఆర్ అతిథి గృహం, టిడ్కో గృహాలు, ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల అదనపు గదులు, షాదీఖానా నిర్మాణాలు, మరికొన్ని ప్రదేశాల్లో లో లెవల్ చప్టాల వల్ల అవస్థలను తొలగించి హై లెవల్ బ్రిడ్జిలు నిర్మిస్తామని చేసిన వాగ్దానాలు.. ఇలా చాంతాడులా జాబితా ఉన్నా అమలుకు నోచుకోలేదు. కనీసం ఆ దిశగా ప్రయత్నాలేమీ చేయకపోవటం గమనార్హం.
- వినుకొండ నియోజకవర్గంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు, పట్టణంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినా అమలు కాలేదు.
- పెదకూరపాడు నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చేస్తామని, రహదారులు బాగు చేసి రవాణా సదుపాయాలు మెరుగు పరుస్తామని నాడు కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు,, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసి నియోజకవర్గ ప్రజలకు అండగా నిలబడతామని వాగ్దానం చేశారు. వంద రోజుల పాలనలో ఆ దిశగా అడుగు కూడా పడలేదు.

ఒక్క హామీ కూడా అమలు కాలేదు



వంద రోజుల కూటమి పరిపాలనలో ఒక్క హామీ కూడా నెరవేరలేదు. ఎన్నికల సందర్భంగా టీడీపీ, ఇతర కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. నియోజకవర్గంలో పరిపాలన గాడి తప్పింది. నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు అసాంఘిక శక్తులుగా మారారు. ముఖ్యమైన సమస్యలు తీరే మార్గం కనిపించడం లేదు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి వారిలో వారే కొట్టుకుంటున్నారు. అన్నింటా అవినీతి పెరిగిపోయింది.

\- షేక్ మౌలాలి, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు, నరసరావుపేట



సత్తెనపల్లి నుంచి అచ్చంపేటకు వెళ్లే రహదారిలో రైల్వేగేటు వద్ద వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు

చౌకదుకాణాల పెంపునకు సన్నాహాలు

ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోంది. చౌకదుకాణాల హేతుబద్ధీకరణ జరపాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో పౌరసరఫరాల శాఖ జిల్లా యంత్రాంగం దానిపై దృష్టి సారించింది. అవసరం ఉన్న చోట చౌక దుకాణాల సంఖ్య పెంచాలని మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ మేరకు జిల్లాలో సుమారుగా 120కిపైగా కొత్త దుకాణాలు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

- జిల్లాలో రేషన్ కార్డులు 4,55,686
- ప్రస్తుతం చౌక దుకాణాల సంఖ్య 1,289
- సుమారు 120కి పైగా పెరిగే అవకాశం



సత్తెనపల్లి పట్టణంలోని ఓ చౌక దుకాణం

సత్తెనపల్లి: జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల రెవెన్యూ డివిజన్‌ల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 28 మండలాలు, 8 పట్టణాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 4,55,686 రేషన్ కార్డులు ఉండగా.. 1,289 చౌక దుకాణాల ద్వారా 12,96,524 మందికి నిత్యావసర సరుకులు అందజేయాల్సి ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సరుకులను అందించేందుకు ఎండీయూ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రతి ఇంటికి సరుకులను సక్రమంగా అందించారు. ఇది పేద వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ వ్యవస్థ ఆర్థిక భారమని మంగళం పాడి, డీలర్ల వ్యవస్థను బలోపేతం చేయాలని భావిస్తోంది.

హేతుబద్ధీకరణ ఇలా.....

ఒక్కో చౌక దుకాణం పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో 400–450, పట్టణ ప్రాంతంలో 500–550, గ్రామ పంచాయతీలో కనీసం 400 రేషన్ కార్డులు ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు కసరత్తు చేపట్టనున్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి సమగ్ర సమాచారం పంపాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

సిద్ధం అవుతున్న ప్రతిపాదనలు

జిల్లాలో 600 కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉన్న దుకాణాల వివరాలను పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్లు గుర్తిస్తున్నారు. వీటి పరిధిలో సరుకుల పంపిణీలో జాప్యం అవుతుండడంతో కొత్త దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. కాస్త దూరంగా ఉన్న ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా సరుకులు ఎలా పంపిణీ చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు. హేతుబద్ధీకరణకు మార్గదర్శకాలు జారీ అయ్యాయని, ఆ మేరకు క్షేత్రస్థాయిలో మండలాలవారీ సమాచారంతో రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఎస్.పద్మశ్రీ తెలిపారు.

ఐదేళ్ల అభివృద్ధికి నివేదికలు రూపొందించండి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



నరసరావుపేట: రానున్న ఐదేళ్లలో ఆయా శాఖలకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలపై నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంపై విజన్ డాక్యుమెంట్ ప్రిపరేషన్ గురించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పి.అరుణ్‌బాబు ఇందులో పాల్గొన్నారు. తర్వాత జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. మండల ప్రణాళికను సెప్టెంబర్ 30 నాటికి, జిల్లా స్థాయి ప్రణాళికను అక్టోబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. సీఎస్ సూచనలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామసభలలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలని పేర్కొన్నారు.

కాణిస్టేబుళ్లు!

అవినీతికి చిరునామాగా చాలామంది కోర్టు కానిస్టేబుళ్లు మారిపోయారు. ఆఖరికి ద్విచక్ర వాహనం పోగొట్టుకున్న బాధితుడు దాన్ని ఓ కోర్టు కానిస్టేబుల్ వద్ద చూసి షాకయ్యారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే దుస్థితి దాపురించింది. ఓ కానిస్టేబుల్‌ను ఆరోపణల నేపథ్యంలో విధుల నుంచి పక్కన పెట్టగా.. మరొకరు కేసు లేకుండా చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్న తీరు కూడా వెలుగులోకి వచ్చింది.



పట్నంబజారు : గుంటూరు జిల్లా కోర్టులో కొంత మంది కానిస్టేబుళ్లు వ్యవహరిస్తున్న తీరు అనేక విమర్శలకు తావిస్తోంది. ఇటీవల కాలంలో జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సతీష్‌కుమార్ శాఖ ప్రక్షాళన దిశగా అడుగులు వేశారు. ఎస్సైల నుంచి హోంగార్డులపై వరకు దృష్టి సారించారు. అవినీతికి పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 35 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను అంతర్గత బదిలీలు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ కొంతమంది అవినీతికి మాత్రం అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

రూ.5 లక్షలు డిమాండ్

గుంటూరు వెస్ట్ పరిధిలోని ఓ స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్ వ్యవహారం కూడా ఇటీవల తెరపైకి వచ్చింది. కోర్టులో పనిచేసే మహిళకు అసభ్యకర మేసేజ్‌లు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారులు అతడిని సస్పెండ్ చేశారు. ఇతడికి సదరు కోర్టులో పనిచేసే కానిస్టేబుల్ వేరే వారితో రాయబారం పంపారు. రూ. 5 లక్షలు ఇస్తే కేస్ ప్రూవ్ కాకుండా చేస్తామని, లేకుంటే ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తామని బెదిరింపులకు దిగినట్లు సమాచారం. వెస్ట్ పరిధిలోని ఒక లూప్‌లైన్ విభాగంలో రైటర్‌గా పనిచేసి ఇక్కడ నుండి వెళ్లిపోయిన హెడ్ కానిస్టేబుల్ ఉదంతం మరొకటి. కోర్టుకు చెల్లించాల్సిన డబ్బులు బాధితుల నుంచి తీసుకుని ఆయన కట్టలేదు. ఇక్కడి నుంచి ఆయన వీఆర్‌కు వెళ్లిపోయారు. ఈ విషయాన్నీ స్టేషన్ సిబ్బంది కొందరు బాహాటంగానే చెబుతున్నారు.

అడ్డగోలు వసూళ్లు

జిల్లా కోర్టులో ప్రతి కోర్టుకు కానిస్టేబుళ్లు ఉంటారు. ప్రధాన కేసులు చూసేందుకు ఒకరు, ప్రాసెస్ వర్క్‌కు ఇంకొకరు ఉంటారు. ఏదైనా కేసులో జరిమానా విధిస్తే బాధితుల నుంచి వీరు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. న్యాయమూర్తి ఎవరికైనా రూ.500 జరిమానా విధిస్తే.. వీరు మాత్రం కోర్టు ఖర్చుల నిమిత్తం అని చెప్పి రూ.5 వేల వరకు అందినకాడికి దోచుకుంటున్నారు. అన్ని కోర్టుల్లోనూ ఇలాంటి వారు కొందరు ఉంటున్నారని బాధితులు బాహాటంగానే వాపోతున్నారు. కోర్టు కానిస్టేబుళ్ల అవినీతికి సంబంధించి నేరుగా జిల్లా, రేంజ్ , రాష్ట్ర స్థాయి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో కొంతకాలం క్రితం ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరిపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించేందుకు సమాయత్తమైనట్లు సమాచారం. అంటే ఇక్కడ అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు



సిబ్బంది తప్పు చేస్తే శాఖాపరమైన శిక్ష తప్పదు. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో కొందర్ని సస్పెండ్ చేశాం. మరి కొంత మందిపై చర్యలు తీసుకున్నాం. కోర్టు కానిస్టేబుళ్ల అవినీతికి పాల్పడినట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. బాధితులు తమ ఇబ్బందిని మా దృష్టికి తీసుకొస్తే తగిన విధంగా స్పందిస్తాం. సిబ్బంది అవినీతికి పాల్పడకుండా విధులు నిర్వర్తించాలి.

\- సతీష్‌కుమార్, జిల్లా ఎస్పీ

చోరీకి గురైన బైకుపై ఐదేళ్లు చక్కర్లు



గుంటూరు నగరానికి అత్యంత సమీపంలోని రూరల్ ప్రాంతంలో ఉన్న ఒక కోర్టు కానిస్టేబుల్ తీరు మరీ దారుణమని చెప్పవచ్చు. ఐదు సంవత్సరాల క్రితం ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామ వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. అప్పట్లో 2 వేల కిలోమీటర్లు మాత్రమే తిరిగింది. ఫిరంగిపురం పీఎస్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. వాహనం దొరక్కపోవటంతో ఆశలు వదులుకున్నారు. ఇటీవల గుంటూరు కోర్టుకు వచ్చినప్పుడు ఒక కానిస్టేబుల్ వద్ద తన వాహనం కనిపించింది. తర్వాత చాసిస్ నెంబర్ పరిశీలించి బైక్ తనదేనని నిర్ధారించుకున్నారు. నేరుగా జిల్లా ఉన్నతాధికారికి ఫోన్ చేయటంతో స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఒక సీఐను కోర్టుకు పంపారు. సదరు కానిస్టేబుల్‌ను వివరణ కోరగా.. గుంటూరు వెస్ట్ పరిధిలోని ఒక స్టేషన్ ఏరియాలో దొంగ దొరికిన సమయంలో ఈ వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తేలింది. సదరు పోలీసుస్టేషన్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు కలిసి ఈ వాహనాన్ని కోర్టులో పనిచేసే ఒక అధికారికి గిఫ్ట్‌గా ఇచ్చారని వెల్లడైంది. ఆయన ఈ బైకును కానిస్టేబుల్‌కు ఇచ్చారు. కనీసం కేసులో పట్టుబడిన వాహనం అని కూడా చూడకుండా ఇప్పటికే సుమారు 50 వేల కిలోమీటర్లు దానిపై తిరిగేయడం గమనార్హం.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

రూ.3 లక్షల విలువైన మొబైల్స్ అపహరణ

నరసరావుపేటటౌన్: మొబైల్ దుకాణంలో రూ.3 లక్షల విలువైన సెల్‌ఫోన్‌లు చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగు చూసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ సుభాని, ఆర్టీసీ బస్‌స్టాండ్ ఎదుటగల వ్యవసాయ మార్కెట్ యార్డు దుకాణ సముదాయంలోని ఓ దుకాణంలో తాజ్ మొబైల్ పేరిట సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి దుకాణం మూసివేసి వెళ్లాడు. ఉదయం వచ్చి తాళాలు తెరవగా దుకాణంలో నూతన సెల్‌ఫోన్‌లు అపహరణకు గురయ్యాయి. దీంతో పాటు రిపేర్‌కు వచ్చిన సెల్‌ఫోన్‌లు సైతం కనిపించలేదు. దుకాణం పైభాగంలోని ఇనుపరేకులను తొలగించి దుండగుడు లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్‌ఐ అశోక్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి, వృద్ధ మహిళలే లక్ష్యం

- సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలో దోపిడీలకు పాల్పడిన ముగ్గురు యువకులు అరెస్ట్
- 84.321 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- కత్తి, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం
- నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించిన డీఎస్పీ హనుమంత రావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంత రావు, సీఐ సురేష్, వెనుక నిందితులు, పోలీస్ సిబ్బంది

సత్తెనపల్లి: ఒంటరి, వృద్ధ మహిళలే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులతో కూడిన ముఠాను సత్తెనపల్లి సబ్ డివిజన్ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలను సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు వెల్లడించారు. బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో వృద్ధ మహిళను, నకరికల్లు మండలం నరసింగపాడు, గుళ్ళపల్లి గ్రామాలలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని ఈ ముఠా దోపిడీలకు పాల్పడ్డారన్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఉత్తర్వులు మేరకు తన పర్యవేక్షణలో పెదకూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సురేష్ దర్యాప్తు చేపట్టారన్నారు. నేరాలకు పాల్పడిన బెల్లంకొండ మండలం నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఉనల దావీదు, బత్తుల సిసింద్రీ, బండారు వీరబ్రహ్మం ముగ్గురు ముద్దాయిలను ఈ నెల 18న అరెస్ట్ చేసి విచారించామన్నారు. ఈనెల 8న అర్ధరాత్రి 12.15 గంటల సమయంలో బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో మారణాయుధాలతో దాడిచేసి వృద్ధ మహిళను గాయపరిచారన్నారు. అడ్డం వచ్చిన వృద్ధుడైన ఆమె భర్తను తీవ్రంగా గాయపరిచి వృద్ధురాలి మెడలో 25 గ్రాముల బంగారు గొలుసును దోచుకెళ్ళారన్నారు. దీనిపై బెల్లంకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. అలాగే 2024 మే 31న నకరికల్లు మండలం నరసింగపాడు గ్రామంలో పొలంలో ఒంటరిగా గేదెలు మేపుకొంటున్న మహిళను కత్తితో బెదిరించి ఆమె మెడలోని 36.301 గ్రాముల బంగారు నానుతాడును అపహరించుకుపోయారన్నారు. 2024 ఆగస్టు 2న నకరికల్లు మండలం గుళ్ళపల్లి గ్రామ శివారులో పచ్చిగడ్డి కోసుకుంటున్న ఒంటరి మహిళ వద్ద 23.20 గ్రాముల బంగారు గొలుసును దోచుకెళ్లారన్నారు.

అరెస్ట్ అయిన ముగ్గురు నిందితుల నుంచి మొత్తం 84.321 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేశామన్నారు. అంతే కాక దాడులకు ఉపయోగించిన ఎరుకల కత్తి, నలుపు రంగు పల్సర్ మోటార్ సైకిల్, స్మార్ట్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనపరుచుకున్నామన్నారు. మొబైల్ ఫోన్ కాల్స్ ఆధారంగా కేసును ఛేదించడం జరిగిందన్నారు. ఈ కేసు ఛేదనలో కృషి చేసిన పెదకూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సురేష్, బెల్లంకొండ ఎస్‌ఐ ఎం.రాజా, హెడ్ కానిస్టేబుళ్లు మోర్ల అంకమ్మ రావు, షణ్ముఖరావు, కానిస్టేబుళ్లు మోర్ల బాలకృష్ణ, రాజేష్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అరెస్ట్ చేసిన ముగ్గురుని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

పీఆర్కేకే మళ్లీ జిల్లా రథసారథ్యం

ఆనందపడుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు


వై.ఎస్.జగన్‌తో పీఆర్కే

మాచర్ల: వైఎస్సార్ కుటుంబానికి అత్యంత విధేయుడిగా వ్యవహరిస్తూ ఆ కుటుంబాన్ని నమ్ముకొని కష్టకాలంలో సైతం మాజీ సీఎం జగన్ వెంట సుదీర్ఘ కాలం నడిచిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సేవలకు గుర్తింపుగా మరోసారి పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పీఆర్కేను నియమిస్తూ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మహానేత డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి 2009లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున పీఆర్కేను ఎంపిక చేశారు. అప్పటి నుంచి ఆయన ఆ కుటుంబాన్ని ఇప్పటి వరకు మరచిపోకుండా వారి వెంట నడుస్తూనే ఉన్నారు. తాను కష్టాలు ఎదుర్కొంటూ, ఇబ్బందులు పడుతున్నా ఏనాడూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయాలని కానీ, మరో ఆలోచన కానీ చేయకుండా ముందుకు నడిచి వైఎస్సార్ కుటుంబం వెంటే నా బాట అంటూ చాటి చెప్పారు. అందులో భాగంగా 2012లో జగన్ వెంట నడిచి అసెంబ్లీలో అనర్హత వేటుకు గురై ఉప ఎన్నికలలో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. 2014, 2019లో పోటీ చేసి గెలిచారు. దశాబ్దాల పాటు వైఎస్సార్ కుటుంబాన్ని అంటిపెట్టుకొని మంత్రి పదవి రాకపోయినా సీనియర్‌గా ఉండి కూడా అసంతృప్తి చెందకుండా పార్టీ కోసం కృషి చేశారు. అదే ఆయనను గుర్తించిన పార్టీ ప్రభుత్వ విప్‌గా నియమించింది. ఆ తరువాత పల్నాడు జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఆయనను అధ్యక్షులుగా ఎంపిక చేసి కొనసాగిస్తున్నారు. అదే నేపథ్యంలో తిరిగి బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ పల్నాడు ఇన్‌చార్జిలతో భేటీ అయిన అనంతరం తిరిగి పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పీఆర్కేను ఎంపిక చేయటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరోసారి జోష్ నెలకొంది. పల్నాటి ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి అనేక సంవత్సరాలుగా పీఆర్కే కృషి చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎదిగిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగుతున్న పీఆర్కేకు మళ్లీ జిల్లా రథసారథ్యం పార్టీ అప్పగించడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించాలి

- జిల్లా పబ్లిక్‌హెల్త్ నర్సింగ్ అధికారిణి సురేఖ
- ఫణిదం పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం


మాట్లాడుతున్న జిల్లా పబ్లిక్‌హెల్త్ నర్సింగ్ అధికారిణి సురేఖ

సత్తెనపల్లి: ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించాలని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి సురేఖ అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి సచివాలయ పరిధిలో మాతా శిశు సంరక్షణ సేవలు, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ సేవలు పరిశీలించేందుకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం ఫణిదం పీహెచ్‌సీని సందర్శించింది. గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వారిని ప్రతినెలా ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేసి జబ్బులు రాకుండా చూడాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు జరిగితే తల్లి,బిడ్డ క్షేమంగా ఉండటంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా లభ్యమవుతాయని చెప్పి ప్రోత్సహించాలన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందంలో జిల్లా స్టాటిస్టికల్ అధికారి నీలకంఠేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి ఉన్నూరు బాషా, పీహెచ్‌సీ కమ్యూనిటీ అధికారి జీవీసీకే మీనాక్షమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి పిట్టల శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు ఉన్నారు.

అడ్మిన్ అదనపు ఎస్పీగా సంతోష్ బాధ్యతలు స్వీకరణ



నరసరావుపేట: పల్నాడు జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీగా జేవీ సంతోష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నంద్యాల జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వహించి పదోన్నతిపై పల్నాడు జిల్లాకు అడిషనల్ ఎస్పీగా నియమితులయ్యారు. నూతన అడిషనల్ ఎస్పీని పలువురు జిల్లా పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కన్నా ... ఇదేందన్నా?!

- ప్రభుత్వ భవనం పై నాయకుల బొమ్మలు
- బొమ్మల కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వెల్లడించిన ఎమ్మెల్యే కన్నా


భవనం పై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, ఎంపీ లావు, ఎమ్మెల్యే కన్నా బొమ్మలు

సత్తెనపల్లి: మండల పరిధిలోని నందిగామ గ్రామంలో గత ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ ప్రారంభించారు. ఈ భవనం ప్రారంభోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన బొమ్మల కార్యక్రమాన్ని రద్దు చేశామని ప్రకటించారు. మరి ప్రభుత్వ ఆస్తి అయిన సచివాలయ భవనంపై ఎవరి తాత సొమ్మని సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బొమ్మలను పెట్టారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ బొమ్మల ఏర్పాటు నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరి దీనిపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్పందన ఎలా ఉంటుందో చూడాలి మరి.

రాష్ట్ర స్థాయి క్విజ్‌లో పల్నాడు విద్యార్థినులకు ద్వితీయ స్థానం

విజేతలుగా నిల్చిన లింగంగుంట్ల శంకరభారతీపురం విద్యార్థినులు



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట: తాడేపల్లిలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక శంకర భారతీపురం స్కూలులో ఎనిమిది, తొమ్మిదవ తరగతులు చదువుతున్న బి.శ్రావణి, జి. నాగశ్రీ రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానం పొందారు. ప్రభుత్వ వైద్యారోగ్యశాఖలోని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహించిన యూత్ ఫెస్ట్ 2024–2025లో భాగంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై స్కూలు విద్యార్థినీ, విద్యార్థులకు అవగానకోసం బుధవారం రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. శంకర భారతీపురం స్కూలులో సైన్స్ టీచర్ (బయాలజీ)గా పనిచేస్తున్న సూరిబాబు వీరికి మార్గదర్శకులుగా వ్యవహరించారు. ద్వితీయ స్థానం పొందిన వీరికి నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్స్ అందజేశారు. త్వరలో నేషనల్ క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు వీరిని ఎంపిక చేయటం జరిగిందని ఏపీ శాక్స్ అధికారులు చెప్పారు. వీరిని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్, తోటి విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు.

వేదవిద్య నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగులు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి పొందేందుకు నిరుద్యోగ వేద పండితుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా దేవదాయశాఖ అధికారి కోట వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. వేద విద్యలో క్రమాంతం, ఆపై కోర్సులు పూర్తిచేసిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, నిరుద్యోగి అని స్వీయ ధ్రువీకరణ పత్రంతో ఈనెల 26వతేదీ లోగా తమ దఖాస్తులను జిల్లా దేవాదాయశాఖ కార్యాలయంలో అందచేయాలని తెలిపారు.

సౌత్-సెంట్రల్ జోన్ మ్యాచ్ డ్రా

తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో సౌత్‌జోన్‌కు మూడు పాయింట్లు


ఈ.ధరణీకుమార్


జీవీఎస్.సుమిత్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలో సౌత్‌జోన్, సెంట్రల్‌జోన్ మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 481 పరుగులు చేయగా, ఓవర్‌నైట్ స్కోర్ 8వికెట్లు నష్టానికి 186 పరుగులతో గురువారం తొలి ఇన్నింగ్స్ ఆడుతున్న సెంట్రల్‌జోన్ 234 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులోని పి.అనంత్ కార్తికేయ 84, ఎం.లేఖజ్‌రెడ్డి 85 పరుగులు సాధించారు. సౌత్‌జోన్ బౌలర్లు షేక్. ఇస్మాయిల్ ఆరు వికెట్లు, ఆర్.ప్రకాష్‌రెడ్డి నాలుగు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్‌జోన్ ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్లు నష్టపోయి 364 పరుగులు చేసింది. జట్టులోని ఈ.ధరణికుమార్ 97 బంతుల్లో 92 పరుగులు, వై.తేజారెడ్డి 69 బంతుల్లో 63 పరుగులు సాధించారు. సెంట్రల్‌జోన్ బౌలర్ జీవీఎస్.సుమిత్ 4వికెట్లు సాధించారు. ఎంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత చాటిన సౌత్‌జోన్‌కు 3 పాయింట్లు, సెంట్రల్‌జోన్‌కు ఒక పాయింట్ లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

- జీజీహెచ్‌లో కళ్లు, చెవులు, నోరు మూసుకుని వినూత్న నిరసన
- 15 వరోజుకు చేరుకున్న నిరసన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు గురువారం చెవులు, కళ్లు, నోరు మూసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకుండా కళ్లు మూసుకుంటుందని, తమ సమస్యలపై నోరు మెదపడం లేదని, కనీసం వినడం లేదంటూ వాపోతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జిలు ధరించి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసేవరకు తమ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు తెలిపారు. రెగ్యులర్ స్టాఫ్ నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, స్వచ్ఛంద ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు మాచర్ల విద్యార్థి



మాచర్ల: పట్టణంలోని సాగర్ రోడ్డులోగల సెయింటాన్స్ ఇంగ్లిషు మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థి ఎ.అగస్త్య ఆనంద్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ తుమ్మా సుజాత గురువారం తెలిపారు. ఈ నెల 15,16 తేదీలలో అనంతపురం , ఎస్‌కె యూనివర్సిటీలో జరిగిన సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్ జరిగాయి. పోటీలకు 200 మంది పాల్గొనగా, మాచర్ల సెయింటాన్స్ స్కూల్ విద్యార్థులు నవంబర్ 12న జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. జమ్మూకాశ్మీర్‌లో జాతీయ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా అగస్త్య ఆనంద్‌కు పీఈటీ మత్తె కుమార్, ప్రతాప్, సంతోష్, ప్రకాశ్, వెంకట్, వినేష్, షార్‌రాజ్, వరప్రసాద్, నాగేశ్వర రావు, మణికంఠ తదితరులు అభినందనలు తెలిపారు.

నవంబర్‌లో ఐఎంఏ రాష్ట్ర సదస్సు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎంఏ నేతలు

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర వార్షిక సదస్సుకు ఈ ఏడాది గుంటూరు నగరం వేదిక కానుంది. బ్రోచర్‌ను గుంటూరు జీఎంఏ హాల్లో గురువారం గుంటూరు వైద్యులు ఆవిష్కరించారు. నవంబర్ 22, 23, 24 తేదీల్లో గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ గార్లపాటి నందకిశోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ తాతా సేవకుమార్ తెలిపారు. సదస్సుకు కో చైర్మన్‌గా డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా డాక్టర్ బూసి రెడ్డి నరేందర్‌రెడ్డి, కో సెక్రటరీగా డాక్టర్ వి. మహేష్, కన్వీనర్‌గా డాక్టర్ ఎస్. ఉమాశంకర్, కోశాధికారిగా డాక్టర్ బి. సాయికృష్ణ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. కమిటీల చైర్మన్లుగా డాక్టర్ ఎస్. అమర్నాథ్ ,డాక్టర్ సీహెచ్. విశ్వేశ్వరరావు, డాక్టర్ ఎం. ఫణి కుమార్, డాక్టర్ జి. వేణుగోపాల్, డాక్టర్ టి. వాసు కిశోర్, డాక్టర్ ఎం.జగదీష్ కుమార్, డాక్టర్ కె. కృష్ణ ప్రసాద్, డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ వి.వి రామకుమార్, డాక్టర్ బి.బి అప్పారావు, మహిళా విభాగానికి డాక్టర్ పి.ఎస్.ఎస్. హరిత వివిధ కమిటీలకు సంధానకర్తలుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సదస్సుకు అతిథులుగా ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్.వి.అశోకన్, కార్యదర్శి, డాక్టర్ అనిల్ కుమార్ జే నాయక్ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.జె.సి. నాయుడు, కార్యదర్శి డాక్టర్ పి.ఫణిధర్, ఐఎంఏ మాజీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి. సమరం తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వైద్యులు అధిక సంఖ్యలో ఈ సదస్సుకు హాజరుకావాలని డాక్టర్ నందకిశోర్, డాక్టర్ సేవ కుమార్ కోరారు. మరిన్ని వివరాలకు 7569702090 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లుగా పదోన్నతి


ఆర్‌డీ కార్యాలయంలో ఫార్మాసిస్టులకు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న ఆర్‌డీ సుచిత్ర

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్ -2 ఫార్మాసిస్టులకు ఆరుగురికి పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లుగా ప్రమోషన్ ఉత్తర్వులను ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర గురువారం అభ్యర్థులకు అందజేశారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న ఆర్.మణికి నెల్లూరు జిల్లాలోని డీఎస్ఆర్ గవర్నమెంట్ కాలేజీలో, మంగళగిరిలో పనిచేస్తున్న ఆర్.అన్నమ్మకు గుంటూరు జీజీహెచ్‌లో, నెల్లూరులో పనిచేస్తున్న ఎం.కృష్ణప్రియకు నెల్లూరు గవర్నమెంట్ కాలేజీలో సీనియర్ ఆఫీసర్స్‌గా ప్రమోషన్ ఇచ్చారు. గుంటూరు జిల్లా ముట్లూరులో పనిచేస్తున్న షేక్ కరిముల్లాకు గుంటూరు మెడికల్ కాలేజీలో, మంగళగిరిలో పనిచేస్తున్న ఎస్.కవితకు ఒంగోలు గవర్నమెంట్ హాస్పటల్‌లో, బాపట్ల జిల్లా మోపర్రులో పనిచేస్తున్న హుల్దా రాణికి మార్కాపురం గవర్నమెంట్ జనరల్ హాస్పటల్‌లో ఫార్మసీ ఆఫీసర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో ఆర్డీతోపాటు డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు షేక్ నాగూర్ షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ బి.శ్యామ్‌లు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం

ప్రత్తిపాడు: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని ఓ పత్తి గోడౌన్‌లో అక్రమంగా రేషన్ బియ్యంను దాచి ఉంచారన్న సమాచారం సివిల్ సప్లయిస్ అధికారులకు అందింది. దీంతో గురువారం సీఎస్ డీటీ పద్మజ స్థానిక అధికారులతో కలిసి గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. 120 బ్యాగుల్లో నిల్వ చేసిన 60 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. దీంతో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గోడౌన్‌ను అద్దెకు తీసుకున్న గుంటూరుకు చెందిన కె. జనార్దన్‌పై 6-ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఎస్ డీటీ తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినా, విక్రయించినా, తరలించిన ఉపేక్షించబోమని పద్మజ హెచ్చరించారు.

పొంతనలేని ప్రశ్నలతో విచారణ

విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాస్‌రెడ్డిని విచారించిన మంగళగిరి పోలీసులు


శ్రీనివాస్‌రెడ్డిని విచారణకు తీసుకు వస్తున్న పోలీసులు

మంగళగిరి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అక్రమంగా అరెస్ట్ అయి జైలులో ఉన్న విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాస్‌రెడ్డిని గురువారం మంగళగిరి రూరల్ స్టేషన్‌కు తరలించి విచారించారు. విచారణలో పోలీసులు శ్రీనివాస్‌రెడ్డిని సంఘటనతో సంబంధం లేని ప్రశ్నలతో విచారించి వైఎస్సార్ సీపీ పెద్దల పేర్లు చెప్పాలని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. పోలీసుల విచారణకు సహకరించిన శ్రీనివాస్‌రెడ్డిని తిరిగి జైలుకు తరలించారు. ఉదయం 8 గంటలకు విచారణ ప్రారంభించిన అధికారులు 12 గంటకు కోర్టులో హాజరు పరచి సాయంత్రం 4 గంటలకు గుంటూరు కారాగారానికి తరలించారు.

ఇల్లు కూలి వృద్ధురాలి మృతి


సూరమ్మ మృతదేహం

పట్నంబజారు: ఇల్లు కూలి వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారం ప్రధాన రహదారిలో అడపా సూరమ్మ (83), కుమారుడు శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు 60 సంవత్సరాల క్రితం నిర్మించిన పెంకుటిల్లులో నివాసం ఉంటున్నారు. గురువారం ప్రమాదవశాత్తు కూలింది. ఇంటి శిథిలాల కింద సూరమ్మ, శ్రీనివాసరావు కిందపడ్డారు. స్థానికులు వెంటనే 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూరమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.